ఉష్ణోగ్రత: గరిష్ఠం 39.9 కనిష్ఠం 20.4

'వక్ఫ్' సవరణకు నిరసన



వికారాబాద్ పట్టణంలో మైనార్టీల నిరసన ర్యాలీ

కేంద్ర ప్రభుత్వం కావాలనే వక్ఫ్ సవరణ బిల్లును తీసుకొచ్చిందని ఆర్టీఏ మెంబర్ ఎర్రవల్లి జాఫర్ ఆరోపించారు. శుక్రవారం వికారాబాద్ పట్టణంలో ఇందుకు నిరసనగా ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ ఈ బిల్లు సవరణను ప్రతీ భారతీయుడు వ్యతిరేకించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తుందని మండిపడ్డారు. ర్యాలీకి దళిత సంఘాల నాయకులు, ముస్లిం మత పెద్దలు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మహమ్మద్ సర్ఫరాజ్, అయూబ్ అన్సారీ, అసిఫ్, వాయిద్ మియా, మైనార్టీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

-వికారాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి)

ఘనంగా గుడ్ ఫ్రైడే

వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. వికారాబాద్ పట్టణంలోని మెథడిస్ట్ చర్చితో పాటు అన్నిచోట్ల ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మేడ్చల్ పట్టణంలోని ఉమానగర్‌లోని సెయింట్ జోసెఫ్ చర్చిలో, చర్చి ఆఫ్ సౌత్ ఇండియాలో పెద్ద సంఖ్యలో హాజరైన క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే ఏసుప్రభువు వేషధారణలో శిలువ ఎత్తుకుని ఊరేగింపు నిర్వహించారు.

-వికారాబాద్/మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి)



మేడ్చల్ పట్టణంలో..



నేటి నుంచి భూ భారతిపై అవగాహన సదస్సులు

» మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ ప్రతినిధి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి 26వ తేదీ వరకు మండలాల వారీగా భూ భారతిపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ గౌతమ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తొలిరోజు(శనివారం) మూడుచింతలపల్లి మండలం కేశవరంలో సదస్సు నిర్వహిస్తారన్నారు. ఈ ఆర్‌వోఆర్ చట్టం భూ వివాదాల పరిష్కారాలు సరళతరం చేయడానికి ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. భూ వివాదాల సత్వర పరిష్కారానికి భూ భారతి అవగాహన సదస్సులు ఉపయోగపడుతాయన్నారు. అవాంతరాలు లేని సేవలను విస్తరించడం కోసం పౌరులు, రైతులు, రైతు సంఘాలు, ప్రజాప్రతినిధులతో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో అందరూ పాల్గొని ఆర్‌వోఆర్ చట్టంపై అవగాహన పెంచుకోవాలన్నారు.

ఇంటివద్ద ఉపాధి అంటూ కుచ్చు టోపీ

మహిళల వద్ద వెయ్యి రూపాయల చొప్పున వసూలు

ఉపాధి విషయం అడగ్గా ఫోన్ స్విచ్ఛాఫ్.. కేసు నమోదు

6

'డబుల్'పై అనాసక్తి!

కేటాయించిన ఇళ్లలోకి చేరని లబ్ధిదారులు



లబ్ధిదారులకు జారీ చేసిన నోటీస్

ప్రభుత్వం ఉచితంగా అందించే ఏ పథకానికైనా ప్రజల నుంచి లక్షల్లో దరఖాస్తుల వస్తాయి. కానీ ఇందుకు విరుద్ధంగా ఉంది డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పరిస్థితి. మేడ్చల్ నియోజకవర్గంలో ప్రభుత్వం పెద్ద సంఖ్యలో డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించింది. ఎన్నికలకు ముందు జీహెచ్ఎంసీ పరిధిలోని అర్హులకు ఆ ఇళ్లను కేటాయించారు. లక్షల్లో దరఖాస్తులు రాగా వేల సంఖ్యలో మాత్రమే లబ్ధిదారులకు ఇళ్లు దక్కాయి. కానీ ఇళ్లను దక్కించుకున్న లబ్ధిదారులు ఇప్పటి వరకు వారికి కేటాయించిన ఇళ్లల్లోకి రాని పరిస్థితి. అక్కడ కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో నగరంలో వివిధ ప్రాంతాల్లో ఉంటున్న లబ్ధిదారులు అక్కడకి వెళ్లడానికి ఇష్టపడటం లేదు.

కనీస వసతులు లేక విముఖత

ఖాళీగా ఉండటంతో శిథిలావస్థలోకి ఇళ్లు

ఊడిపోతున్న తలుపులు, కిటికీలు

రెండుసార్లు నోటీసులు

జారీ చేసిన జీహెచ్ఎంసీ అధికారులు

20లోగా చేరకపోతే

రద్దు చేస్తామని లబ్ధిదారులకు హెచ్చరిక

స్థానికులకు కేటాయించాలని డిమాండ్

డబుల్ ఇళ్లలోకి చేరిన వారి వివరాలు

ప్రాంతం	డబుల్ ఇళ్లు	చేరినవారు
రాంపల్లి	6,203	1,500
ప్రతాపసింగారం	2,000	1,100
తూంకుంట	1,656	1,400
దుండిగల్	3,996	3,600



తూంకుంటలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు

మేడ్చల్ ప్రతినిధి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): నగరంలో ఏ మూలన ఉన్న కూడా కూతవేటు దూరంలో అన్ని సౌకర్యాలుంటాయి. గ్రామ శివార్లల్లో కనీసం బస్సు సౌకర్యం కూడా లేని చోట్ల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఉండటంతో లబ్ధిదారులు వారు ఉండే చోటుని విడిచి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలోకి చేరడానికి ఆసక్తి కనబర్చడం లేదు. దీంతో జీహెచ్ఎంసీ అధికారులు లబ్ధిదారులకు నోటీసులు జారీ చేస్తున్నారు. ఇప్పటికే రెండుసార్లు నోటీసులను జీహెచ్ఎంసీ అధికారులు జారీ చేశారు. చివరగా ఈ నెల 20లోపు తమకు కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలోకి చేరకపోతే వారికి కేటాయించిన ఇళ్లను రద్దు చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. మేడ్చల్ నియోజకవర్గంలో

మిగతా 8వ పేజీలో...

శిథిలావస్థలోకి నూతన ఇళ్లు

లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లలో జనం లేకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుతున్నాయి. వాడకంలో లేకపోవడంతో గోడలు పగ్గులు పడుతున్నాయి. కిటికీలు, తలుపులు ఊడిపోవడం, పిచ్చి మొక్కలు మొలిచి దీన స్థితిలోకి చేరుతున్నాయి. దీంతో జీహెచ్ఎంసీ అధికారులు తమకు కేటాయించిన ఇళ్లల్లో చేరాలని లబ్ధిదారులకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

దొంగల భయం.. ప్రతీరోజు జాగారం



కలెక్టరేట్ కాలనీలో గస్తీ కాస్తున్న కాలనీవాసులు

వికారాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అప్పులు చేసి ఇళ్లు కట్టుకున్నారు. ఆదమరిచి నిద్ర పోదామనుకుంటే దొంగలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. దీంతో పగలు ఉద్యోగం చేస్తే రాత్రి కాలనీలో గస్తీ కాయాల్సిన పరిస్థితి. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మణికంఠనగర్, కలెక్టర్ ఆఫీస్ కాలనీ, ఎల్లమ్మ తోటలో నిత్యం జాగరం చేయాల్సిన పరిస్థితి. కాలనీలో ఇటీవల రెండు, మూడు చోట్ల దొంగతనం జరిగిన నేపథ్యంలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులకు సమాచారమిచ్చినా రాత్రిపూట గస్తీ మరిచారని, ఫలితం లేకుండా పోయిందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు దొంగతనాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



వైభవంగా భద్రేశ్వరుడి పల్లకీ సేవ

తాండూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తాండూరు శ్రీభావిగి భద్రేశ్వర స్వామి బ్రహోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. నాలుగోరోజు శుక్రవారం ఆలయ కమిటీ చైర్మన్‌పటేల్ కిరణ్‌కుమార్ మంగళహారతితో వేడుకలు ప్రారంభించారు. అర్ధరాత్రి వరకు కొనసాగిన పల్లకీ సేవ అలరించింది. పురంతయ్యాల విన్యాసాలు, భజన సంకీర్తనలు, బాణసంచాల చప్పుళ్లు, భక్తుల నైవేద్యాల సమర్పణ మధ్యన పల్లకీ సేవ కొనసాగింది. నేడు(శనివారం) స్వామి వారి రథోత్సవం, ఆదివారం లంకాదహనం కార్యక్రమాలను నిర్వహించనున్నారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ సంతోష్‌కుమార్ పర్యవేక్షణలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



తాండూరు రూరల్: అంతారంలో ఈదురుగాలులకు ఎగిరిపడ్డ ఇంటిపై రేకులు

గాలివాన బీభత్సం

ఉమ్మడి జిల్లాలో ఉరుములు, మెరుపులతో వర్షం

వికారాబాద్‌లో చెట్టు విరిగిపడి ఇద్దరికి గాయాలు

దెబ్బతిన్న మామిడి, మక్క బొప్పాయి, అరటి తోటలు

యాచారంలో కూలిన పశువుల దొడ్లు

తాండూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం



మర్పల్లిలో ధ్వంసమైన బొప్పాయి తోట

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, ఏప్రిల్ 18: ఉమ్మడి జిల్లాలో గాలివాన బీభత్సం సృష్టించింది. శుక్రవారం పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై భారీగా నీరు నిలిచి ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. బలమైన గాలులు వీచడంతో చెట్లు విరిగిపడ్డాయి. పశువుల దొడ్లు కూలిపోయాయి. వరి పంట నేల వాలింది. వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వికారాబాద్ జిల్లా మర్పల్లి, కొత్లపూరం, సిరిపూరం గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి దాదాపు 20 ఎకరాల్లో బొప్పాయి, 10 ఎకరాలకు అరటి తోటలు, 30 ఎకరాల్లో మొక్క జొన్న పంటలు పూర్తిగా నేలమట్టమయ్యాయి. మమ్మదనపల్లి సమీపంలో చెట్టు విరిగి రోడ్డుపై పడడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వికారాబాద్ పట్టణం కొత్తగడి సమీపంలో వీచిన ఈదురు గాలులకు భారీ వృక్షం విరిగి ట్రాక్టర్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులపై పడింది. ఈ ఘటనలో వారు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన బాధితులను వెంటనే మెడిక్యూర్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణరాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు, వికారాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ కుమార్ ఆసుపత్రికి వెళ్లి బాధితులను

మిగతా 7వ పేజీలో...

ఎమ్మెల్యేల పల్లెబాట

మండుటెండల్లో పరీక్ష

జూన్ 2వరకు తిరగాలని సీఎం ఆదేశాలు

'స్థానిక'ంలో విజయమే లక్ష్యం

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం

7

నర్సరీ స్థలంపై వివాదం

రాత్రికిరాత్రే బోర్డు తొలగింపు

గేటుకు తాళం వేసిన ప్రైవేట్ వ్యక్తి

నర్సరీని కాపాడాలని స్థానికుల డిమాండ్

7

బస్టాండ్ అభివృద్ధి జరిగేనా?

వేలాది మంది ప్రయాణికులతో కిటకిట

44 ఏళ్ల క్రితం కొడంగల్‌లో నిర్మాణం

వసతులు లేక ప్రయాణికుల ఇబ్బందులు

శిథిలావస్థలో మరుగుదొడ్లు.. తాగునీటి వసతి కరువు

బీజాపూర్ హైవే పక్కనే ఉండటంతో నిత్యం రద్దీ

సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో బస్టాండ్ అభివృద్ధిపై ఆశలు

కొడంగల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ప్రతీ రోజు వేలాది మంది ప్రయాణికులతో కిటకిటలాడే కొడంగల్ ఆర్టీసీ బస్టాండ్ కనీస వసతులు లేక కొట్టుమిట్టాడుతోంది. హైదరాబాద్ - బీజాపూర్, మహబూబ్‌నగర్, తాండూర్ ప్రధాన రహదారులను కలిపే ఈ బస్టాండ్ శిథిలావస్థలో ఉంది. మరుగుదొడ్లు దీనస్థితిలో ఉండగా కనీసం తాగునీటి వసతి లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్పటి జనాభాకు అనుగుణంగా 1981లో ఆనాటి సీఎం టంగటూరి అంజయ్య ఈ బస్టాండ్‌ను ప్రారంభోత్సవం చేశారు. బస్టాండ్ నిర్మాణం జరిగి 44 సంవత్సరాలు గడుస్తోంది. అయినా ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతులకు చర్యలు చేపట్టకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. వర్షాకాలంలో పరిస్థితి మరీ ఘోరంగా ఉంటుందని ప్రయాణికులు వాపోతున్నారు. వేసవి కాలంలో బస్టాండ్‌లో తాత్కాలిక షెడ్డును ఏర్పాటు చేయగా ఈదురు గాలులకు అది కాస్త లేచిపోయింది. ఇక మరుగుదొడ్లను పరిశీలిస్తే నీటి సౌకర్యం సరిగా లేకపోవడంతో దుర్గంధం వెదజల్లుతుంది. ప్రయాణికులకు కనీసం కూర్చునేందుకు కుర్చీలు

మిగతా 8వ పేజీలో...



కొడంగల్ బస్టాండ్

కొడంగల్ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు



అన్నీ రంగాల్లో వెనకబాటుకు గురైన కొడంగల్ సమగ్ర అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం అయ్యాయి. అందుకనుగుణంగా ఆర్టీసీ బస్టాండ్ నూతన నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ ప్రాంతాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ముందుకు వెళ్తున్నారు. అభివృద్ధికి అందరూ సహకరించి ముందుకు తీసుకెళ్లాలి.

-తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి



కులకచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

పరిగి ఎమ్మెల్యేపై బీజేపీ నేతల ఫిర్యాదు

కులకచర్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల పోలీస్‌స్టేషన్‌లో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిపై స్థానిక బీజేపీ నాయకులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ విచారణ ఎదుర్కొంటున్న కాంగ్రెస్ నాయకులు తమ తప్పులను కప్పి పుచ్చుకునే ప్రయత్నంలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ దిష్టిబొమ్మ దహనం చేయడం సిగ్గు చేటన్నారు. రెండు రోజుల క్రితం వికారాబాద్ చౌరస్తాలో పీఎం దిష్టిబొమ్మ దహనం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేష్, సెంట్రల్ టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు వెంకటయ్యగౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి రాజ్యాంగపరమైన బాధ్యతల్లో ఉండి పీఎం దిష్టిబొమ్మను దహనం చేయడం సరికాదన్నారు. ఈడీ విచారణ చేస్తున్న కేసుపై కాంగ్రెస్ నాయకులు గుమ్మడి కాయల దొంగలు ఎవరంటే భుజాలు తడుముకున్నట్లు ఉందని ఎద్దేవా చేశారు. రామ్మోహన్‌రెడ్డి వెంటనే పీఎం మోదీకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చంద్రలింగం, యాదయ్య, మండల ప్రధాన కార్యదర్శి హనుమంతు, అంజి, గిరిజన మోర్చా అధ్యక్షుడు మహేశ్, రాంచంద్రయ్య, నరేశ్, హరీశ్, సంతోష్, కృష్ణ, హరికృష్ణ, దస్తయ్య పాల్గొన్నారు.

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీని రాష్ట్రంలో బలోపేతం చేసేందుకు సభ్యత్వ నమోదుపై పార్టీ శ్రేణులు దృష్టిపెట్టి భారీ సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేయించాలని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి, పొలిట్‌బ్యూరో మెంబర్ బక్కని నర్సింహులు అన్నారు. మొయినాబాద్ పట్టణ పరిధి పెద్దమంగళారంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణలో టీడీపీకి పునర్వైభవం తెచ్చేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ కష్టపడి పనిచేయాలన్నారు. సభ్యత్వ నమోదు విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని తెలిపారు. పార్టీ బలోపేతానికి అందరూ పనిచేయాలని పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ మాజీ ఉపాధ్యక్షుడు కేతన్‌రావు, ప్రధాన కార్యదర్శి రాఘవులు, పార్టీ మండల అధ్యక్షుడు ఎల్గని యాదయ్యగౌడ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ సభ్యత్వంపై శ్రేణులు దృష్టి పెట్టాలి : బక్కని


పెద్దమంగళారంలో సభ్యత్వ నమోదులో బక్కని నర్సింహులు

స్నేహితుడికి ఆర్థికసాయం అందజేత

యాచారం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):అనారోగ్యంతో బాధపడుతున్న మిత్రుడికి శుక్రవారం రూ.83వేల ఆర్థికసాయం అందించారు. మండలంలోని చిన్నతూండ్లకు చెందిన జక్కుల రవీందర్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గ్రామ యువకులు, స్నేహితులు, ఉద్యోగులు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో రావుల వెంకటేష్, శ్రీను, సుధాకర్, సుమన్‌రెడ్డి, వెంకటేష్ ఉన్నారు.

చెరువు కుంటల జోలికెళ్లం : ఆర్డీవో

యాచారం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ భూముల్లో ఉన్న చెరువు లు, కుంటల జోలికి వెళ్లం అని, వాటిల్లోకి రైతులు ఇప్పటి లాగే వెళ్లేలా వీలు కల్పిస్తామని ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజనల్ ఆఫసర్(ఆర్‌డీవో) అనంతరెడ్డి తెలిపారు. ఫార్మా భూములకు ఫెన్సింగ్ వేస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఆయన ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లోని చెరువులు, కుంటల్లోకి రైతులు, మత్స్యకారులు ఎప్పటిలాగే వెళ్లి వారి పనులు చేసుకోవచ్చన్నారు. నీటి వనరుల వద్దకు రోడ్డు వేస్తామని చెప్పారు. చెరువు, కుంటలను ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలకు అప్పగిస్తుందనే మాటలు నమ్మొద్దని సూచించారు. నీటి వనరుల సంరక్షణ ప్రభుత్వానిదే బాధ్యత అని నొక్కి చెప్పారు. కొందరు తప్పుడు వార్తలను సృష్టించి ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారన్నారు. చెరువు, కుంటలపై రైతులు, కులవృత్తుల వారు ఆధారపడతారన్నారు. కోర్టు కేసుల్లోని భూములను స్వాధీనం చేసుకోం అన్నారు.

దాహార్తి తీర్చేందుకు కృషి చేయాలి

ఘట్‌కేసర్,ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి):ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం ఘట్‌కేసర్ బైపాస్ చౌరస్తాలో మల్లారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రయాణికులకు, బీఆర్ఎస్ కార్యకర్తలకు మజ్జిగను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. పార్టీ నాయకులు సేవా కార్యక్రమాలను చేపట్టాలన్నారు. పార్టీ సభకు పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చేలా కృషిచేయాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, సంజీవరెడ్డి, కొండల్‌రెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


నాయకులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

రెడీమిక్స్ ప్లాంట్‌ను ప్రారంభించిన స్పీకర్

వికారాబాద్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌లోని గోదాంగూడ రోడ్డులో గల సీఆర్ఆర్ రెడీమిక్స్ ప్లాంట్‌ను అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రారంభించారు. శుక్రవారం ప్లాంట్ ప్రారంభోత్సవంలో భాగంగా పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ వేడుకల్లో నిర్వాహకులు లక్ష్మీకాంత్‌రెడ్డి స్పీకర్‌కు స్వాగతం పలికారు. కార్యక్రమంలో వికారాబాద్ పట్టణ ప్రముఖులు, రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


రెడీ మిక్స్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

ఇంటివద్ద ఉపాధి అంటూ కుచ్చు టోపీ

● మహిళల వద్ద రూ.వెయ్యి చొప్పున వసూలు
● పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు

మోమిన్‌పేట్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఇంటి దగ్గరే ఉపాధి కల్పిస్తామని మహిళల దగ్గర లక్షలాది రూపాయలు వసూలు చేసిన ఓ మహిళను మోమిన్‌పేట్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. మండలంలోని ఎన్కెపల్లికి చెందిన కిష్టయ్య, కేశమ్మ దంపతుల కూతురు పడాల సురేఖకు సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం బిల్లలపుర గ్రామానికి చెందిన నాగరాజ్‌తో వివాహం చేసి ఇల్లరికం తెచ్చుకున్నారు. భర్త రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా సురేఖ ఇంటి దగ్గరే టైలరింగ్ పనిచేసుకుంటూ జీవిస్తోంది. ఈ క్రమంలో ఓ రోజు సెల్‌ఫోన్‌లో రీల్ చూస్తూ.. ఇంటి వద్దే ఉంటూ నెలకు పది వేలు సంపాదించే అవకాశం కల్పిస్తామనే వీడియో చూసింది. రీల్‌లో తెలిపిన చిరునామాలో సంప్రదించగా మహేందర్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. తమ కంపెనీలో మహేందర్ అండ్ మహేందర్ చాక్లెట్లు తయారు చేస్తామని, వాటిని మీ ఇంటికి పంపిస్తామన్నాడు. వాటిని ప్యాక్ చేసి పంపితే నెలకు 15వేల వరకు ఇస్తామని తెలిపాడు. అలాగే మహిళలకు ఉపాధి కల్పించేందుకు కంపెనీలో ఉద్యోగాలున్నాయని సురేఖను నమ్మించాడు. దీంతో సురేఖ అతడి మాట ప్రకారం మోమిన్‌పేట్ మండలంలోని రాంనాథ్‌గూడపల్లి, మోమిన్‌పేట్, చంద్రాయన్‌పల్లి, వెల్చాల్, నవాబుపేట్, కోట్‌పల్లి మండలాల్లోని గ్రామాలు ఎల్లకొండ, బార్వాద్‌లో మహిళల దగ్గరికి వెళ్లి వెయ్యి రూపాయల చొప్పున వసూలు చేసింది. డబ్బులిచ్చిన మహిళలు సురేఖకు ఫోన్ చేస్తుండగా మీకు త్వరలోనే కంపెనీ చాక్లెట్లు వస్తాయని చెప్పసాగింది. కొన్ని రోజులనుంచి మహిళలు సురేఖకు ఫోన్ చేయగా సరైన సమాధానం చెప్పలేదు. ఫోన్ స్విచాఫ్ చేసింది. దీంతో శుక్రవారం ఉదయం ఆయా గ్రామాల మహిళలు ఎన్కెపల్లిలోని సురేఖ ఇంటికి వెళ్లి నిలదీశారు. దీంతో భయంతో సురేఖ వెంటనే డయల్ 100కు సమాచారం ఇచ్చింది. పోలీసులు గ్రామానికి వెళ్లి జరిగిన విషయాన్ని తెలుసుకొని సురేఖను స్టేషన్‌కు తీసుకువెళ్లారు. సమాచారం తెలుసుకున్న మిగతా గ్రామాల మహిళలు స్టేషన్‌కు చేరుకొని పోలీసులకు జరిగిన విషయాన్ని వివరించారు. మహిళల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ దత్తాత్రేయ తెలిపారు.


పోలీసులకు వివరాలు వెల్లడిస్తున్న బాధిత మహిళలు

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నిరసనలు



పరిగిలో జరిగిన భారీ నిరసన ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

పరిగి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు పరిగి మసీదు కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నమాజ్ తర్వాత జామ మసీ దు నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి సీపీఎం, ఎల్‌హెచ్‌పీఎస్ మద్దతు పలికాయి. జిల్లా పరిషత్ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మీర్ మహమూద్ అలీ, నాయకులు మాట్లాడుతూ.. ముస్లింలకు వ్యతిరేకంగా బిల్లును తెచ్చారన్నారు. వక్ఫ్ అంటేనే ప్రార్థన స్థలమని, కేంద్రప్రభుత్వం ముస్లింల హక్కులకు చట్టాలు చేస్తోందన్నారు. వక్ఫ్ బిల్లుకు మద్దతిచ్చిన ఏపీ సీఎం చంద్రబాబు, బిహార్ సీఎం నితీష్‌కుమార్‌లను ముస్లింలు క్షమించరన్నారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు మోహిజ్, నాయకులు మీర్ తాహేర్ అలీ, సయ్యద్ అయూబ్, యూసుఫ్ అలీ, సమీపటేల్, అబ్దుల్ బషీర్, పాషసాబ్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు: తాండూరులో వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలు నిరసన తెలిపారు. మసీదుల్లో ప్రార్థనల అన ంతరం నిరసన తెలిపారు. ముస్లింల అణచివేతకే బిల్లు తెచ్చారని, దాన్ని వాపస్ తీసుకునే వరకు పోరాటం చేస్తామని అన్నారు.

మోమిన్‌పేట్/నవాబుపేట: వక్ఫ్ బిల్లును రద్దు చేయాలని ముస్లిం నాయకులు డిమాండ్ చేశారు. మోమిన్‌పేట్‌లోని జామా మస్జిద్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అన ంతరం ఆర్ఐ గోవర్ధన్‌కు వినతిపత్రం ఇచ్చారు. నవాబుపేట మండ లం ఏక్‌మామిడి, అక్నాపూర్, చిట్టిగిద్ద, చంచల్‌పేట్ తదితర గ్రామాల ముస్లిం, మైనారిటీలు వికారాబాద్‌లో జరిగిన నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. మోదీ ప్రభుత్వం ముస్లిం, ఇతర మైనారిటీలపై చిన్న చూపు చూస్తూ రాక్షసపాలన కొనసాగిస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మొహ్మద్ రఫీ, షఫీ, మన్సూర్ అలీఖాన్, గౌస్, తౌఫీక్, ఇబ్రహీం, హాజీ మన్సూర్, ఆసిఫ్ పాల్గొన్నారు.

శంషాబాద్: వక్ఫ్ బిల్లు రద్దు చేయాలంటూ ముస్లింలు శంషాబాద్‌లోని హైదరాబాద్-బెంగళూరు రహదారిపై ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ బస్టాండ్, ఎయిర్‌పోర్టు చౌరస్తాల గుండా కొనసాగింది.

వికారాబాద్: కేంద్ర ప్రభుత్వం కావాలనే వక్ఫ్ సవరణ బిల్లును తెచ్చిందని ఆర్పీఏ మెంబర్ ఎర్రవల్లి జాఫర్ అన్నారు. వికారాబాద్‌లో ముస్లింలు ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ బిల్లును ప్రతీ భారతీయుడు వ్యతిరేకించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని కుట్ర చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మహమ్మద్ సర్ఫరాజ్, అయూబ్ అన్సారీ, ఆసిఫ్, వాయిద్ మియా, నాయకులు పాల్గొన్నారు.


శంషాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన నాయకులు

ధారూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగసమందర్, అల్లాపూర్ గ్రామాల్లో వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న వరి పొలాలను శుక్రవారం బీజేపీ నాయకులు పరిశీలించారు. గురువారం కురిసిన వడగండ్లకు ఈనిన పొలాలల్లో వడ్ల గింజలు రాలి నష్టం జరిగిందని రైతులు నాయకులకు వివరించారు. గింజ రాలిన వరి కంకులను వారు పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడారు. వడగండ్లకు దెబ్బతిన్న పొలాలను అధికారులతో క్షేత్రస్థాయిలో సర్వే చేయించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాజునాయక్, అసెంబ్లీ కో-ఆర్డినేటర్ నందు, బీజేపీ నాయకులు పాండుగౌడ్, వివేకనంద రెడ్డి, రాజేందర్‌గౌడ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.


దెబ్బతిన్న వరి పొలాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మద్దతు ధర వడ్ల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ అన్నారు. శుక్రవారం బొంరాస్‌పేట్ మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. దళారులను ఆశ్రయించి రైతులు మోసపోకుండా మద్దతు ధర కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అమ్మితేనే సన్న వడ్లకు ప్రభుత్వం ఇచ్చే బోనస్ వస్తుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. రైతులకు సదుపాయాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్, నాయకులు రాంచంద్రారెడ్డి, వెంకట్రాములుగౌడ్, మల్లికార్జున్, భీమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి దయాకర్, అంజన్‌కుమార్‌లపై ఫిర్యాదు

కందుకూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేతలు అద్దంకి దయాకర్, అంజన్‌కుమార్‌యాదవ్‌పై కందుకూరు పోలీస్‌స్టేషన్‌లో బీజేవైఎం నాయకులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. బీజేవైఎం రాష్ట్రస్పోర్ట్స్ సెల్ కన్వీనర్ ఊటు మహేందర్, జిల్లాప్రధాన కార్యదర్శి బూర దిలీప్ ఆధ్వర్యంలో ఎస్సై సైదులుకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిలపై అసభ్యకర పదజాలంతో దయాకర్, అంజన్‌కుమార్ మాట్లాడారన్నారు. కార్యక్రమంలో సామల దయాకర్‌రెడ్డి, వరుణ్‌కుమార్, కె.శ్రీశైలం, అండేకార్ సాయి, మేరుగు మహేందర్, అభిలాష్ పాల్గొన్నారు.


ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న బీజేవైఎం నాయకులు

నాసిరకం వస్త్రం

● గాలివానకు చిరిగిన జాతీయ జెండా ● నిర్లక్ష్యానికి నిదర్శనం

తాండూరు, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం, జాతీయ జెండా అంటే ప్రేమ, భక్తి లేక పోవడం వంటి కారణంతో ఆవి ష్కరించిన కొన్నాళ్లకే నాణ్యత లేక పట్టణంలో నెలకొల్పిన పెద్ద జాతీయ జెండా చిరిగిపోయింది. గురువారం రాత్రి గాలులు, వర్షానికి 100 ఫీట్ల ఎత్తులో తాండూరులో ఏర్పాటు చేసిన ఆవిష్కరించిన జాతీయ జెండా చిరిగిపోయింది. గమనించిన అధికారులు రాత్రికి రాత్రే జెండాను తొలగించారు. కొన్ని నెలల క్రితం రూ.24లక్షలు వెచ్చించి ఇక్కడ భారీ జాతీయ జెండాను నెలకొల్పారు. ఒక్కో జెండా రూ.3 లక్షల వరకు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. జెండాను సరఫరా చేసిన సమయంలో మున్సిపల్ అధికారులు నాణ్యతను పరిశీలించక నాసిరకం జెండాను ఎక్కించారని ఆరోపణలున్నాయి. ఇప్పటికే ఈ జాతీయ జెండాను రెండుసార్లు మార్చారు. కాంట్రాక్టర్‌కు యేడాది కాలం పాటు ఫ్రీ సర్వీస్ ఇవ్వాల్సి ఉంటుంది. మున్సిపల్ అధికారులు అదనంగా బిల్లు చెల్లిస్తారా? సర్వీసు తెప్పిస్తారా? వేచి చూడాలి.

కేంద్రాల కోసం రైతుల ఎదురు చూపులు

కులకచర్ల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు రైతులు ఎదురు చూస్తున్నారు. రైతులు పంట కోసి కల్లాల్లో ధాన్యం ఆరబెట్టి నిల్వ ఉంచారు. పొద్దంతా ఎండ, సాయంత్రం కాగానే మబ్బులు కమ్మి వర్షం కురుస్తోంది. దీంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. మండల పరిధిలో 60శాతం వరి కోతలు పూర్తయ్యాయి. గత్యంతరం లేక కొందరు వ్యాపారులకు క్వింటాలు రూ.2,100కే విక్రయిస్తున్నారు. కొనుగోలు కేంద్రంలో క్వింటా రూ.2,300 ధర వస్తుంది.

పార్టీ సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే

తాండూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాయంలో గాంధీభవన్‌లో శుక్రవారం చేవేళ్ల లోక్‌సభా నియోజకవర్గ పార్టీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. సహచర ఎమ్మెల్యేలతో కలిసి సమావేశంలో పార్టీ నేతలు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి వీరికి దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలో పార్టీ పటిష్టానికి నాయకులు పలుసూచనలు చేశారని ఎమ్మెల్యే తెలిపారు.


పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి, పీసీసీ చీఫ్‌లతో పాటు పాల్గొన్న మనోహర్‌రెడ్డి

మృతిచెందిన లారీ డ్రైవర్ గుర్తింపు

● రంగారెడ్డి జిల్లాచెన్నంపల్లికి చెందిన రాజుగా నిర్ధారణ

జగ్గయ్యపేట రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట-చిల్లకల్లు రహదారిలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఎస్ఆర్ఎంటీ ట్రాన్స్‌పోర్టు వాహనం గురువారం రాత్రి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో మృతిచెందిన డ్రైవర్‌ను రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం చెన్నంపల్లికి చెందిన రాజు(43)గా పోలీసులు గుర్తించారు. రాజు 15ఏళ్లుగా డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం ఉదయం హైదరాబాద్ నుంచి విజయవాడకు బయలుదేరి మార్గమధ్యంలో జగ్గయ్యపేట కార్యాలయంలో పని చూసుకుని వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ముందు వెళుతున్న కారు టైరు పంక్చరై డివైడర్‌ను ఢీకొని రోడ్డుకు అడ్డంగా తిరగటంతో దాని వెనుకున్న ఆటోను రక్షించే క్రమంలో రాజు నడుపుతున్న లారీ పల్టీ కొట్టింది. ఆటోలో ఉన్న రూపన పుల్లయ్య, శివరాత్రి వెంకటేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో విజయవాడ నుంచి జగ్గయ్యపేట వస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ క్షతగాత్రులను జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్యులు అందుబాటులో ఉండాలని సూచించారు. వారికి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య నిమిత్తం విజయవాడ తరలించారు.

యువజన కాంగ్రెస్ ధర్నా

» కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కడ్తాల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): నేషనల్ హెరాల్డ్ కేసులో ఏఐసీసీ నాయకురాలు సోనియాగాంధీ, ఎంపీ రాహుల్‌గాంధీలపై ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన చార్జిషీట్‌ను నిరసిస్తూ కడ్తాలలో శుక్రవారం యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోసు రవి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. హైదరాబాద్-శ్రీశైలం రహదరిపై నిరసన అనంతరం ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టి బొమ్మలను దహనం చేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్ మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను బహిర్గతం చేస్తున్నందునే అక్రమ కేసులతో వేధిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు ఇమ్రాన్‌బాబ, పట్టణాధ్యక్షుడు భానుకిరణ్, శ్రీకాంత్, పర్వతాలు, విజయ్, లింగం, మహేశ్, రామకృష్ణ, ప్రవీణ్ గౌడ్, సందీప్, ఆకాశ్‌గౌడ్, శ్రీకాంత్, నరేశ్, లక్ష్మణ్, శ్రీను, శివ పాల్గొన్నారు.

'బీజేపీపై అసత్య ఆరోపణలొద్దు'

ఆమనగల్లు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్‌గాంధీలపై చార్జిషీట్ నమోదు కావడంతో నకిలీ గాంధీల బండారం బయటపడుతోందని ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. రాజకీయంగా కాంగ్రెస్ భూస్థాపితం అవుతుందనే దేశ వ్యాప్తంగా బీజేపీపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఆమనగల్లులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా కాంగ్రెస్‌కు డిపాజిట్ కూడా దక్కదని, బీజేపీ, ప్రధాని మోదీపై చేస్తున్న అసత్య ప్రచారాలను కాంగ్రెస్ నాయకులు మానుకోవాలని ఆయన హెచ్చరించారు. ప్రజల్లో ఆదరణ కోల్పోయిన కాంగ్రెస్ మనుగడ కోసమే పాకులాడుతోందని ఎద్దేవా చేశారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

కందుకూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధి కొత్తూరులో నిర్మించనున్న భక్త హనుమాన్ రామలింగేశ్వర ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన పూజ శుక్రవారం వైభవంగా జరిగింది. వేద పండితులు రాజుశర్మ ఆధ్వర్యంలో ఉదయం గణపతి హోమం నిర్వహించారు. మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణానాయక్, పీసీసీ ప్రచార కమిటీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అనేగౌని అంజయ్యగౌడ్, ఆర్ఆర్ పౌల్ట్రీ యజమాని రవీందర్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో డీబీసీసీ డైరక్టర్లు ఆనంద్, డాక్టర్ శంకర్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు అంజిరెడ్డి, సాధ మల్లారెడ్డి, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లుగుప్తా పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

చౌదరిగూడ,ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్ధుల జంగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం వనంపల్లి, చౌదరిగూడ గ్రామాల్లో కార్మికులతో సమావేశమయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు. పంచాయతీ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, కృష్ణ, షబ్బీర్, చిన్నయ్య, నర్సమ్మ, యాదయ్య, జీపీ కార్మికులు వీరేశ్, పాపయ్య, జంగయ్య, చంద్రయ్య, లింగమయ్య పాల్గొన్నారు.

మోటరేసి దప్పిక తీర్చారు!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బషీరాబాద్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కాశీంపూర్ ఎస్సీ కాలనీలో నీటి ఎద్దడి నివారణకు అధికారులు చర్యలు తీసుకున్నారు. కాలనీలో నీటిఎద్దడంటూ 'ఆంధ్రజ్యోతి'లో గురువారం వార్త ప్రచురితమైంది. ఎంపీడీవో విజయ్‌కుమార్ పంచాయతీ కార్యదర్శి అశోక్‌కు ఫోన్‌చేసి సమస్యపై తెలుసుకున్నారు. కాలనీలో నీటి సమస్య నెలకొందని, మూడు నెలల కింద బోరు వేసినా నిధుల్లేక కొత్త మోటార్ బిగించలేదని చెప్పారు. దీంతో పాత మోటార్‌ను బాగుచేయించాలని ఎంపీడీవో ఆదేశించారు. నిధులు లేకున్నా కార్యదర్శి సొంత డబ్బుతో సింగిల్ ఫేజ్ మోటర్‌ను బాగు చేయించి బోరులో దించారు. కాలనీ వాసుల నీటి సమస్య తీరింది.

ఐడియా అదుర్స్!

జనరేటర్‌తో సెల్‌ఫోన్ చార్జింగ్



సెల్‌ఫోన్లు చార్జింగ్ పెట్టుకుంటున్న కాలనీవాసులు

పెద్దేముల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఐడియా అదిరిపోయింది. కరెంటు లేదని చింతించకుండా కొత్తగా ఆలోచించి సెల్‌ఫోన్ల చార్జింగ్‌తో పాటు మోటారు నుంచి తాగునీరును సైతం పట్టేసుకున్నారు. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలంలో గురువారం నాటి గాలివాన దుమారానికి తట్టెపల్లి సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా చేసే 11కేవీ లైన్‌లో మూడు స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో తట్టెపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు కరెంటు సరఫరా ఆగిపోయింది. కనీసం సెల్‌ఫోన్‌లో సైతం చార్జింగ్ పెట్టుకోలేని దుస్థితి. అయితే తట్టెపల్లి గ్రామంలో సుమారు 24 గంటలుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఒక కాలనీలోని యువకులు కొత్తగా ఆలోచించారు. వీటన్నింటికి ఒకటే పరిష్కారమని జనరేటర్‌ను తీసుకొచ్చి కాలనీలోని బోరుకు కనెక్షన్ ఇచ్చి తాగునీరు పట్టుకున్నారు. అలాగే మరో కనెక్షన్ కొన్ని బోర్డులకు ఇచ్చి వాటి ద్వారా ఒకేసారి సుమారు 20 ఫోన్ల వరకు చార్జింగ్ పెట్టుకున్నారు. అలా విడతల వారీగా ఫోన్ చార్జింగ్ చేసుకుని అటు తాగునీటి సమస్య, ఇటు చార్జింగ్ సమస్యను పరిష్కరించుకున్నారు.

ఆవిష్కరణలపై ఇక్ఫాయ్, బిట్స్ ఒప్పందం

శంకర్‌పల్లి, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): జాతీయ భద్రతల ఆవిష్కరణ, నైపుణ్యాభివృద్ధి పెంపునకు ఇక్ఫాయ్ వర్సిటీ, బిట్స్ పిలానీలు అవగాహన ఒప్పందం చేసుకున్నాయి. శంకర్‌పల్లి మండలంలో గల ఇక్ఫాయ్ కళాశాలలో శుక్రవారం అవగాహన ఒప్పందంపై బిట్స్ పిలానీ గ్రూప్ వైస్‌చాన్స్‌లర్ వి.రామ్‌గోపాల్‌రావు, ఇక్ఫాయ్ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ వీసీ ఎల్ఎస్. గణేశ్‌లు సంతకం చేశారు. జాతీయ భద్రతాంశాల్లో పరిశోధన/ఆవిష్కరణలు, విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిలో పరస్పరం సహకరించుకోవాలని ఒప్పందం చేసుకున్నారు. వారు మాట్లాడుతూ.. జాతీయ భద్రతలో ఆధునిక సాంకేతికాంశాలపై ఉమ్మడి పరిశోధన, ఆవిష్కరణులు, కన్సల్టెన్సీ అసైన్మెంట్లు, స్టార్టప్ కో-ఇంక్యుబేషన్ తదితరాలపై కృషిచేస్తామన్నారు. డీఆర్డీవో మాజీ చైర్‌పర్సన్ జి.సతీష్‌రెడ్డి ఈ ఒప్పందంపై అభినందించారు. కార్యక్రమంలో బిట్స్ పిలానీ అధిపతి రామమనోహర్‌బాబు, బిట్స్ హైదరాబాద్ డైరెక్టర్ సామ్సో, ప్రొఫెసర్లు అమృత, సంకత్ గోయెల్, విజయలక్ష్మి, శైలజన్, సాయినాథ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల పల్లెబాట

మండుటెండల్లో ప్రజాప్రతినిధులకు 'పరీక్ష'

» జూన్ 2 వరకు గ్రామాల్లో తిరగాలని సీఎం ఆదేశం
» పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని దిశానిర్దేశం
» 'స్థానికం'లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఉద్బోధ



తాండూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): "ఎన్నికల ముందు తిరిగినట్టే ఇప్పుడూ పర్యటించాలి. ప్రజల్లో తిరుగాలి. ఎమ్మెల్యేలు హైదరాబాద్‌కే పరిమితం కావొద్దు. సామాజిక మాధ్యమాలను విస్తృతంగా వినియోగించుకొని పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. జూన్ 2వ తేదీ వరకు నిరంతరం పల్లెల్లో తిరగండి. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి." అని ఇటీవల నిర్వహించిన కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ(సీఎల్పీ) సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి తోటి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సూచించారు. సీఎం ఆదేశాలతో ఎమ్మెల్యేలు ఇక పల్లెబాట పట్టనున్నారు. 46రోజులూ పల్లెల్లో తిరగాలని ప్రభుత్వాధినేత ఎమ్మెల్యేలను ఆదేశించారు. ఏప్రిల్ 16 నుంచి జూన్ 2వ తేదీ వరకు గ్రామాల్లో పర్యటనకు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు. దీంతో ఎమ్మెల్యేలు పల్లెబాటకు కసరత్తు ఇప్పటికే కొందరు ఏదో కార్యక్రమం పేరిట గ్రామాల్లో తిరుగుతున్నారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వికారాబాద్ నుంచి, సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం తెలసిందే. ఇక తాండూరు, పరిగి ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డిలు సీఎం ఆదేశాలతో నియోజకవర్గాలల్లో 'పల్లెబాట' పడుతున్నారు.

ప్రభుత్వ పనులపై ప్రచారం

ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రచార సభల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ వాటిల్లో నెరవేర్చిన, తీరుస్తున్న హామీలను ప్రజలకు వివరిస్తారు. ఏడాదిన్నర పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వ విజయాలు, ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలు, వర్తింపజేస్తున్న పథకాలపై ప్రచారం చేస్తారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే సిలిండర్, 200యూనిటర్ల వరకు ఉచిత కరెంటు, కొత్తగా తెచ్చిన 'రాజీవ్ యువ వికాసం', రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ, 'భూ భారతి' పోర్టల్, రైతుబంధు, రుణామాఫీ, కొత్త రేషన్‌కార్డుల జారీ వంటి కార్యక్రమాలను ప్రజల్లోకి తెసుకెళ్లి పార్టీకి మైలేజీ తేవాలని సీఎం, పీసీసీ చీఫ్ సూచించారు. రేవంత్‌రెడ్డి సర్కార్ చేపట్టిన కులగణన సర్వే, ఎస్సీ వర్గీకరణ అమలు, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు, నియోజకవర్గాల్లో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలను హైకమాండ్ ఆదేశించింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు చూపుతున్న మొండిచెయ్యి, కేంద్రం నుంచి రావాల్సిన నిధులు విడుదల చేయకపోవడం, రాష్ట్రానికి కేంద్ర సహాయ నిరాకరణ తదితరాంశాలపై ప్రజల్లో ఎండగట్టాలని సూచించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల తప్పుడు ప్రచారాన్ని ప్రజల్లోనే తిప్పికొట్టేలా ఎమ్మెల్యేలు స్థానిక నాయకత్వంతో కలిసి ప్రజల్లో అవగాహన కల్పించి స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసేలా ఇప్పటి నుంచే సన్నద్ధమయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కలిసి పర్యటిస్తారా?

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీగా ఉన్న ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డి తాండూరు గతంలో తాండూరు ఎమ్మెల్యేగా పనిచేశారు. తాండూరు ప్రాంతంపై పట్టున్న ఈయన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డితో కలిసి పర్యటిస్తారా? అన్న సందేహం శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. అయితే మే 1 నుంచి జూన్ 2వ తేదీ వరకు నియోజకవర్గాలలో తానూ పర్యటిస్తానని సీఎం ప్రకటించారు. ఇప్పటి వరకు సీఎం హోదాలో తాండూరు, పరిగి, వికారాబాద్ నియోజకవర్గాల్లో రెవంత్‌రెడ్డి పర్యటించలేదు. అయితే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ఆయన హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న ఈ నియోజకవర్గాల్లో పర్యటిస్తారని పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు.

కరెంటు కట్‌తో కష్టాలు

» 24గంటలపాటు పవర్ బంద్
» తాండూరువాసుల అవస్థలు

తాండూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): 'తాండూరు ప్రాంతంలో గంటలకొద్దీ కరెంటు సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు విద్యుత్ లేక ఇక్కట్లకు గురయ్యారు. గురువారం రాత్రి ఈదురు గాలుల, వర్షంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకోక పాత తాండూరు వాసులు, పెద్దేముల్ లైన్‌లోని కందనెల్లితండా, గాజీపూర్, గోట్లపల్లి, బుద్ధారం గ్రామాలకు 24గంటలు కరెంటు సరఫరా నిలిచింది. తాగునీటికి, పంటల నీటిపారకానికి ఇక్కట్లు పడ్డారు. గురువారం సాయంత్రం 4గంటలకు తాండూరులో విద్యుత్ సరఫరా నిలిచింది. అర్ధరాత్రి ఒంటిగంట తర్వాత కొన్ని ప్రాంతాల్లో కరెంటొచ్చింది. పాత తాండూరు ఫీడర్‌లో సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. అధికారులకు ఫోన్‌లు చేస్తే స్విచాఫ్ వచ్చాయని పాత తాండూరు వాసులు వాపోయారు. వాట్సాప్ గ్రూప్‌లో మెస్సేజ్‌లు పెట్టి కరెంటు సరఫరా పునరుద్ధరించాలని కోరారు. అదే రాత్రి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌కమింగే లేదని, ఫీడర్ ట్రిప్ అవుతోందని అధికారులు చెప్పారు. గంటల తరబడి విద్యుత్ లేకుంటే ఏం చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఫీడర్ ట్రిప్ అయినా, ఫ్యూజ్ పోయినా స్వల్పకాలంలో తీర్చగలిగే సమస్యేనని, మరి గంటలకొద్దీ సరఫరా ఎందకు నిలిచిందని ట్రాన్స్‌కోసిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. ముస్ముందు ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.



తాండూరు మండలం అంతారంలో తండాలో..

గాలివాన బీభత్సం

(ఐదో పేజీ తరువాయి)

పరామర్శించారు. వికారాబాద్ సదాశివపేట ప్రధాన రహదారి కావడంతో అరగంట పాటు వాహనాలు ఎక్కడికక్కడ నిలిచి పోయాయి. రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని కొత్తపల్లి, కొత్తపల్లి తండా తదితర గ్రామాలలో ఈదురు గాలులకు పశువుల దొడ్లు నేలకూలాయి. రేకులు లేచిపోయి దూరంగా పడిపోయాయి. గాలులకు వరిపంట నేలవాలింది. రోడ్డుకు అడ్డంగా చెట్లు పడిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పలు ఇండ్లపై వేప చెట్లు కూలడంతో ఇంటి యజమానులు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. కొత్తపల్లి, మాల్ గ్రామాల మధ్యన రోడ్డుకు అడ్డంగా చెట్లు కూలడంతో రైతులు ఇండ్లకు చేరుకోవడానికి తంటాలు పడ్డారు. ఈదురు గాలుల కారణంగా వరి పంటలకు స్వల్పంగా నష్టం జరిగిందని రైతులు చెప్పారు. తాండూరులో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మొయినాబాద్ మండలంలో రెండు గంటల పాటు భారీగా కురిసిన వర్షానికి కరెంట్ సరఫరా నిలిచి పోయింది. కేతిరెడ్డిపల్లిలో చెట్లు విరిగిపడ్డాయి. ఇబ్రహీంపట్నంలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంధకారం చోటుచేసుకుంది. రోడ్లపై నీరు నిలిచి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈదురుగాలులకు మామిడి కాయలు నేలరాలాయి. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని వివిధబస్తీల్లో మోస్తరు వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి.



మర్పల్లిలో ఈదురు గాలులకు నేల కొరిగిన అరటి తోట

వర్షపాతం నమోదు ఇలా..

ఉమ్మడి జిల్లాలోని మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ ఆదర్శ్‌నగర్‌లో 43.8 మిల్లీమీటర్లు, బాలానగర్‌లో 39.3 మిల్లీమీటర్లు, ఉప్పల్‌లోని మునరాబాగ్‌లో 18.0 మిల్లీమీటర్లు, కూకట్‌పల్లిలో 16.3 మిల్లీమీటర్లు, రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ శివరాంపల్లిలో 38.5 మిల్లీమీటర్లు, అత్తాపూర్‌లో 29.5 మిల్లీమీటర్లు, సరూర్‌నగర్ ఎస్బీఐ కాలనీలో 29.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బాలాపూర్ మండలం ఏవియేషన్ అకాడమీ, నాదర్‌గూల్ ప్రాంతంలో 26.3 మిల్లీమీటర్లు, శంషాబాద్ మండలం వినయ్‌నగర్‌లో 25.5 మిల్లీమీటర్లు, కొత్తూరులో 22.5 మిల్లీమీటర్లు, ఇబ్రహీంపట్నంలో 21.0 మిల్లీమీటర్లు, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తుర్కయంజాల్‌లో 20.8 మిల్లీమీటర్లు, శేరిలింగంపల్లిలో 19.3 మిల్లీమీటర్లు, ఇబ్రహీంపట్నం మండలం మంగళ్‌పల్లిలో 19.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

రజతోత్సవ సభకు భారీగా జనసమీకరణ

» బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తితో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జిల్లా నుంచి భారీగా జనసమీకరణ చేస్తామని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణ పరిధి శేరిగూడలో గల సీకే కన్వెన్షన్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా నుంచి వెయ్యి బస్సులు, రెండు వేల కార్లలో కార్యకర్తలు, అభిమానులు, రైతులు, మహిళలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచే 7వేల మందిని సమీకరిస్తున్నామని, వంద బస్సులు, ఇతర వాహనాలను ఏర్పాటు చేస్తామన్నారు. వచ్చే వారందరికీ తాగునీరు, మజ్జిగ, భోజన వసతి కల్పిస్తామన్నారు. ఆ రోజు ఊరూరా జెండా విష్కరణ చేస్తామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమొచ్చిన ఏడాదిన్నర తర్వాత బీఆర్ఎస్ నిర్వహిస్తున్న బహిరంగ ఇదని, పార్టీ అధినేత కేసీఆర్ ప్రసంగం కోసం రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారని కిషన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను కేసీఆర్ ప్రజలకు వివరిస్తారని చెప్పారు. రేవంత్ సర్కార్ విధానాలతో ఆర్థికవ్యవస్థ చిన్నాభిన్నమైందన్నారు. హామీలను తుంగలో తొక్కారన్నారు. రైతు రుణమాఫీ,రైతు భరోసా, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇలా ఒక్కటి కాదు.. ఇచ్చిన ఏ హామీని పూర్తిగా నెరవేర్చలేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధే కంటికి కన్పిస్తోందని, కాంగ్రెస్‌తో ఒనగూరిందేమీ లేదన్నారు.

'రంగారెడ్డీ రాజీనామా చెయ్!'

మంత్రి పదవి రాకుంటే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన మల్‌రెడ్డి రంగారెడ్డి దమ్ముంటే వెంటనే రాజీనామా చేయాలని కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. మంత్రి పదవొస్తే ఏదో చేస్తానని కాలం ఎల్లదీస్తూ మల్‌రెడ్డి నియోజకవర్గానికి ఏడాదిన్నరగా ఏమీ చేయడం లేదన్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన రూ.470కోట్ల పనుల ప్రొసీడింగులను కూడా పట్టించుకోలేదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, వి.లక్ష్మారెడ్డి, సత్తు వెంకటరమణారెడ్డి, డి.రాంరెడ్డి, ఎ.యాదగిరి, జక్క రాంరెడ్డి, చంద్రయ్య, కృపేశ్, రమేష్‌గౌడ్, బుగ్గ రాములు, రమేష్, కిషన్‌గౌడ్, ఎ.వెంకట్‌రెడ్డి భరత్‌రెడ్డి, జె.రాజు, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ స్థలంపై వివాదం

రాత్రికి రాత్రే బోర్డు తొలగింపు.. గేటుకు తాళం వేసిన ప్రైవేట్ వ్యక్తి
నర్సరీని కాపాడాలని స్థానికుల డిమాండ్

ఘట్‌కేసర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఐదు సంవత్సరాల క్రితం మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన నర్సరీ స్థలం వివాదాస్పదంగా మారింది. మున్సిపల్ పదో వార్డు సర్వేనెంబర్ 127లోని ప్రైమ్‌ల్యాండ్ వెంచర్‌లో గల పార్కుస్థలంలో 2020 సెప్టెంబరు 26న 9,560చదరపు గజాల విస్తీర్ణంలో నర్సరీని ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి నర్సరీ బోర్డుపై పేరు తొలగించి.. 'ఈ స్థలం కందకంట్ల మాధవరెడ్డిది.' అని ఫోన్‌నెంబర్ రాశారు. అధికారులు, కౌన్సిల్ నర్సరీని ఏర్పాటు చేశారు. మంత్రి మల్లారెడ్డి ప్రారంభించారు. శిలాఫలకాన్ని గతంలోనే ఎవరో మాయం చేశారు. అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తం అయ్యాయి. తాజాగా నర్సరీ బోర్డుపై నలుపు పూసి ప్రైవేట్ వ్యక్తి పేరు రాసుకున్నారు. ఈ ఘటనపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు ఏం చేస్తున్నారని పశ్నిస్తున్నారు. ప్రైవేట్ స్థలమైతే సదరు అక్కడ నర్సరీని ఎలా ఏర్పాటు చేశారని, సదరు వ్యక్తి అప్పట్లోనే ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు విచారణ జరిపి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు.




నర్సరీ ఆర్చిపై రాతలను చెరిపేశారిలా...

ఈ స్థలం నాదే

ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనెంబర్ 127లో 9,560 చదరపు స్థలాన్ని నేను 2019లో కొన్నా. నా స్థలంలో ఏర్పాటు చేసిన నర్సరీని తొలగించాలని మున్సిపల్ అధికారులకు ఎన్ని సార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. ఏడీ సర్వే రిపోర్టు ఆధారంగా నా స్థలాన్ని స్వాధీనం చేసుకున్నా. కోర్టుకు వెళ్లినా స్థలం నాకే వస్తుంది.

- కందకట్ల మాధవరెడ్డి, ఘట్‌కేసర్

మున్సిపాలిటీ స్థలాన్ని కాపాడాలి



ఘట్‌కేసర్‌లోని ప్రైమ్‌ల్యాండ్ వెంచర్‌లో గల పార్కు స్థలంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ బోర్డుపై ప్రైవేట్ వ్యక్తి పేరు రాసుకోవడం సరి కాదు. ఏదైనా ఉంటే కోర్టులో చూసుకోవాలి. దీనిపై పూర్తి స్థాయి విచారణ చేయాలి. కోట్ల రూపాయాల విలువైన పార్కు స్థలాన్ని కాపాడేందకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

- రాధాకృష్ణ, కాంగ్రెస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి

చర్యలు తీసుకుంటాం



కొండాపూర్‌రోడ్డులో గల నర్సరీ బోర్డుపై రాసిన రాతలపై చర్యలు తీసుకుంటాం. ఆ స్థలం మున్సిపాలిటీదే. దీనిపై ఏమైనా అభ్యంతరాలుంటే కోర్టుకు వెళ్లాలి. కానీ రాత్రికిరాత్రే బోర్డులు చెరిపేయడం సరికాదు. నర్సరీలో మొక్కలు పెంచుతున్నాం. వాటికి రోజు నీరుపోయాలి. ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్, ఘట్‌కేసర్

ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కలిసిన సీతారాంపేట్ ఆలయ కమిటీ చైర్మన్ భీమలింగం

తాండూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సీతారంపేట్ హనుమాన్ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సూచించారు. నూతనంగా ఎన్నికైన ఆలయ కమిటీ చైర్మన్ బీమలింగం, సభ్యులు శుక్రవారం మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆలయ కమిటీ చైర్మన్ భీమలింగం, కమిటీ సభ్యులు ఎం.నర్సింహులు, కె.విశ్వనాథ్, బి.మంజుల, బి.నర్సింహులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



రాకొండలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

దోమ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాకొండ గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ శాంతకుమార్, సీనియర్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి, యాదయ్యగౌడ్, రమేశ్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

21న 'టెట్'పై ఉచిత అవగాహన

వికారాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏకేఆర్ స్టడీ సర్కిల్లో ఈనెల 21(సోమవారం) టెట్ పరీక్షపై ఉచిత అవగాహన సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు డైరెక్టర్ బీవీ.రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు శ్రీకాకుళంకు చెందిన తెలుగు అధ్యాపకులు వేణుగోపాల్ హాజరై బీఎడ్, డీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. శివరాం నగర్ కాలనీలోని హనుమాన్ దేవాలయం పక్కనగలహాల్‌లో ఉదయం 9.30 నుంచి ఈ అవగాహన సదస్సు ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9441022571 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బస్టాండ్ అభివృద్ధి జరిగేనా?

(ఐదో పేజీ తరువాయి)

లేకపోవడంతో బస్టాండ్ ఆవరణలో ఉన్న ఓ చెట్టు కింద సేదతీరడం పరిపాటిగా మారింది. కొడంగల్ ప్రాంతాన్ని అన్నీ రంగాల్లో అభివృద్ధి చేస్తానన్న సీఎం రేవంత్ రెడ్డి నూతన బస్టాండ్ నిర్మాణంతో సౌకర్యాలు కల్పిస్తారని ప్రజలు భావిస్తున్నారు.



చెట్టు కింద సేదదీరుతున్న ప్రయాణికులు(ఫైల్)

వేలాది మందితో నిత్యం రద్దీ

హైదరాబాద్-బీజాపూర్, మహబూబ్‌నగర్-తాండూర్ ప్రధాన రహదారులను కలిపే రోడ్డు పక్కన ఉన్న బస్టాండ్‌కు వందలాది బస్సు సర్వీసుల రాకపోకలతో వేలాది మంది ప్రయాణికులకు రద్దీ కనిపిస్తుంది. తెలంగాణ ఆర్టీసీ బస్సులతో పాటు కర్ణాటక రాష్ట్ర బస్సు సర్వీసులు ఇక్కడికి వచ్చి వెళ్తుంటాయి. ప్రధానంగా హైదరాబాద్ టు కొడంగల్, యాద్గీర్, గుర్మిట్‌కాల్, గుల్బర్గ, సేడం, రాయచూర్, మంత్రాలయం, మహబూబ్‌నగర్, తాండూర్, శ్రీశైలం, యాద్గీర్‌గుట్ట, భద్రచలం, నారాయణపేట, ముంబాయి తదితర ప్రాంతాలకు బస్సు సర్వీసులు కొనసాగుతాయి. కర్నాటక సరిహద్దు కావడంతో ఆర్టీసీ బస్సులు గుల్బర్గ, సేడం, గుర్మిట్‌కాల్, యాద్గీర్ నుంచి కొడంగల్ కు వచ్చి వెళ్తుంటాయి.

కాంప్లెక్స్ నిర్మాణం జరిగేనా?

కొడంగల్ ఆర్టీసీ బస్సు ముందు భాగంలో డబ్బాల ఏర్పాటు చేసుకొని వ్యాపారులు కొనసాగిస్తున్నారు. గతంలో రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆ డబ్బాల స్థానంలో కాంప్లెక్స్ నిర్మాణం చేసి చిరు వ్యాపారులకు ఇచ్చేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఆయన ప్రయత్నం కలగానే మిగిలిపోవడంతో ప్రస్తుతం అదే పరిస్థితి కొనసాగుతోంది. రేవంత్‌రెడ్డి ప్రస్తుతం ముఖ్యమంత్రిగా కొనసాగుతుడంటంతో కొడంగల్‌పై దృష్టి సారించడంతో నూతన బస్టాండ్ నిర్మాణం, కాంప్లెక్స్ ఏర్పాటు, మౌలిక వసతుల కల్పన చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

బస్టాండ్ అభివృద్ధిపై దృష్టి సారించాలి



40 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ బస్టాండ్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. జనాభా పెరుగుదల, ప్రయాణికుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని బస్టాండ్ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించాలి. నూతన బస్టాండ్, కాంప్లెక్స్ నిర్మాణంతో సదుపాయలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి. కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

- ఇందనూర్ బషీర్, సీపీఐ నాయకుడు, కొడంగల్

'డబుల్'పై అనాసక్తి!

(ఐదో పేజీ తరువాయి)

రాంపల్లి, ప్రతాపసింగారం, కొర్రెముల, జవహర్‌నగర్, తూంకుంట, మురహరిపల్లి, కిష్టాపూర్, తదితర ప్రాంతాల్లో వేలాదిగా డబుల్ బెడ్ రూమ్‌లు నిర్మించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని వారికి ఆయా డబుల్ బెడ్ రూమ్‌లను కేటాయించారు.

వేల సంఖ్యలో చేరాల్సిన లబ్ధిదారులు

రాంపల్లిలో 6,203 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించగా అందులో 6,200 జీహెచ్‌ఎంసీ పరిధిలోని లబ్ధిదారులకు కేటాయించారు. ఇందులో కేవలం 1,500 మంది మాత్రమే తమకు కేటాయించిన ఇళ్లల్లో చేరగా మిగతా 4,500 మంది ఇంకా చేరలేదు. ప్రతాపసింగారంలో 2 వేల మందికి గాను 1,100 మంది మాత్రమే చేరారు. అలాగే తూంకుంటలో 1,656 మందికి గాను 1,400 మంది, దుండిగల్‌లో 3,996 మందికి గాను 3,600 మంది, కొర్రెములలో 30 మంది, మురారిపల్లిలో 2,200 మంది, అహమ్మద్‌గూడలో 300 మంది ఇంకా చేరాల్సి ఉంది.

జిల్లావాసులకు కేటాయించాలి

జిల్లా పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను జిల్లాకు చెందిన అర్హులకు కేటాయిస్తే ఈ పరిస్థితి ఉండేది కాదని స్థానిక ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అన్ని సౌకర్యాల మధ్యలో ఉంటున్న జీహెచ్‌ఎంసీ పరిధిలోని వారు అక్కడి సౌకర్యాలను వదిలి ఎక్కడో గ్రామాల శివార్లలో ఎటువంటి సౌకర్యాలు లేనిచోట ఉండమంటే ఎలా ఉంటారని ప్రశ్నిస్తున్నారు. ఇక్కడి ప్రాంతం వారికి కేటాయిస్తే ఇక్కడి వసతులపై అవగాహన ఉంటుంది. కాబట్టి సర్ధుకుపోయే వారని భావిస్తున్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు సమయంలో జిల్లాకు చెందిన ప్రజలకు తమవంతుగా కూడా తమ వాటా కేటాయించాలని ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా గత ప్రభుత్వం పట్టించుకోకుండా ఎన్నికల సమయంలో హడావుడిగా ఇళ్లను జీహెచ్‌ఎంసీ పరిధిలోని వారికి కేటాయించింది. ఇప్పుడవి నిరుపయోగంగా ఉండటంతో కోట్ల ప్రజాధనం వృథాకానుంది. ఈ నెల 20లోగా తమకు కేటాయించిన ఇళ్లల్లో చేరకపోతే రద్దు చేస్తామని జీహెచ్‌ఎంసీ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ హెచ్చరికలు పెడచెవిన పెడితే లబ్ధిదారుల కేటాయింపులు రద్దు చేసి ప్రజాపాలనలో దరఖాస్తుదారులకు ఇళ్ల కేటాయిస్తారనే ప్రచారం సాగుతోంది.

క్రైం కార్నర్

వృద్ధురాలి మెడలో బంగారు చైన్ అపహరణ

- తాగేందుకు నీళ్లు అడిగి చోరీకి పాల్పడిన దుండగులు

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): తాగడానికి నీళ్లు అడిగిన గుర్తుతెలియని ఇద్దరు దుండగులు ఓ వృద్ధురాలి మెడలో బంగారు చైన్‌ను లాక్కెళ్లారు. ఈ ఘటన పోచారం పోలీసుస్టేషన్ పరిధి శుక్రవారం చోటుచేసుకుంది. పోచారం మున్సిపాలిటీ, అన్నోజిగూడ మజీద్ సమీపంలో నివాసముంటున్న బి.పద్మ(60) అనే వృద్ధురాలు శుక్రవారం మధ్యాహ్నం తన ఇంటి మెయిన్‌గేట్ వద్ద నిలబడి ఉంది. గుర్తుతెలియని ఇద్దరు దుండగుల కారులో వచ్చి తన ఇంటి ముందు ఆగి పద్మను తాగడానికి నీళ్లు అడిగారు. ఆమె ఇంట్లోకి వెళ్లి నీళ్లు తీసుకొచ్చి ఇవ్వగా ఓ వ్యక్తి నీళ్లు తాగుతుండగా మరో వ్యక్తి ఆమె మెడలో నుంచి 5తులాల బంగారు చైన్ లాక్కొని ఇద్దరూ కారులో పరారయ్యారు. దీంతో వృద్ధురాలు కేకలు వేయడంతో స్థానికులు వారిని వెంబడించినా ఫలితం లేకుండా పోయింది. కారుకు పసుపు రంగులో నంబర్ ప్లేట్ ఉందని తెలిపారు. పద్మ శుక్రవారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేసిన వారిపై ఫిర్యాదు



దోమ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

దోమ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేసిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు మల్లేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం దోమ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16న వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో అధికార పార్టీకి చెందిన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో పాటు మరి కొంత మంది దేశ ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి దిష్టిబొమ్మ దహనం చేసిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



కాళ్ళాపూర్ తండావాసులతో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళ్ళాపూర్‌తండాలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. కాళ్ళాపూర్ తండాల్లో కొత్తగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం తండావాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తండాల్లో సీసీ రోడ్లు, మురికినీటి కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. ఈ ఉత్సవంలో పరిగి ఏఎంసీ చైర్మన్ బి.పరశురాం రెడ్డి, తావుర్యానాయక్, పులిందర్ పాల్గొని పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

వనం ఎల్లమ్మతల్లి ఆలయంలో పూజలు

కులకచర్ల: మండలంలోని తిరుమలాపూర్‌లో వనంల ఎల్లమ్మ దేవత, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గ్రామగౌడ సంఘం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామం నుంచి ఎల్లమ్మ ఆలయం వరకు విగ్రహ ఊరేగింపు చేపట్టారు. సాయంత్రం గ్రామ మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకొని నైవేద్యాలు సమర్పించారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణయ్యగౌడ్, రాములుగౌడ్ పాల్గొన్నారు.

ఈదురుగాలులకు అతలాకుతలం

- రైతులను నిండా ముంచిన అకాల వర్షం
- వడగండ్లతో పంటలకు తీరని నష్టం
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, విరిగిపడిన చెట్లు
- గ్రామాల్లో విద్యుత్ అంతరాయం



మేడ్చల్ టౌన్: పట్టణంలో కురుస్తున్న వర్షం



వికారాబాద్: సదాశివపేట రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

తాండూరు రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం అర్ధరాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. అంతారం, అంతారం తండా, బెల్కటూర్, ఎల్మకన్నె, రాంపూర్ తదితర గ్రామాల్లో వీచిన ఈదురు గాలిక, వడగండ్ల వర్షానికి రైతులు పంట నష్టపోగా, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షానికి రోడ్లపైకి చేరగా, మురుగు కాల్వలు ఉప్పొంగి ప్రవహించాయి. వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బెల్కటూర్‌లో 70 ఎకరాలు, అంతారంలో 50 ఎకరాలతోపాటు వివిధ గ్రామాల్లో వందల సంఖ్యలో కోతకు వచ్చిన వరిపంటకు నష్టం వాటిల్లింది. వరి పంట నష్టంపై వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి నష్టాన్ని అంచనా వేయాలని రైతులు కోరుతున్నారు. వర్ష బీభత్సానికి మండలంలోని ఆయా గ్రామాల్లో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. చెట్లు, చెట్ల కొమ్మలు రహదారిపై పడ్డాయి. రోడ్ల పక్కన పెట్టిన హోర్డింగ్‌లు గాలి దుమారానికి రోడ్లపై పడిపోగా, షాపులు, ఇళ్లపై కప్పులు గాలిలో ఎగిరి పడ్డాయి. రోడ్లపై పడిన చెట్ల కొమ్మలు, విద్యుత్ తీగలతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తాండూరు మండలంలో 24గంటలపాటు విద్యుత్ సరఫరా లేక ఉక్కపోత, దోమలతో ప్రజలు అవస్థలు పడ్డారు.

మేడ్చల్ గంట పాటు కుండ పోత వర్షం

మేడ్చల్ టౌన్: పట్టణంలో శుక్రవారం గంట పాటు ఈదురు గాలులతో గంటపాటు వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండతో వేడిగా ఉన్న వాతావర్ణం ఒక్కసారిగా చల్ల బడింది.గాలివానకు విరిగిపడిన చెట్టు

వికారాబాద్: పట్టణంలో మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో మమ్మదనపల్లి సమీపంలో చెట్టు విరిగి రోడ్డుపై పడడంతో వాహనాల రాక పోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వికారాబాద్ సదాశివపేట ప్రధాన రహదారి కావడంతో అరగంట పాటు వాహనాలు ఎక్కడివి అక్కడ నిలిచిపోయాయి. చెట్టు విరిగి పోవడంతో ట్రాక్టర్‌పై వెళ్తున్న శేఖర్‌రెడ్డి, వాజిద్ అనే ఇద్దరు గాయాలయ్యాయి. గాయపడిన బాధితులను వెంటనే మెడిక్యూర్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే ఆనంద్ ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు.

నవాబుపేట: మండలంలో శుక్రవారం భారీ వర్షం, ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. మాముదాన్ పల్లి ప్రధాన రహదారిపై చెట్లు విరిగి పడ్డాయి. చెట్లు విరిగి పడటంతో వాహనాల రాకపోకలకు తీవ్రఅంతరాయం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ ఘటనాస్థలానికి చేరుకొని రోడ్డుపై విరిగి పడిన చెట్లను జేసీబీ సాయంతో తొలగించారు.



నవాబుపేట: రోడ్డుపై విరిగి పడిన చెట్ల కొమ్మలు



తాండూరు రూరల్: చంద్రవంచలో వర్షానికి కుంగిన నిర్మాణంలో ఉన్న బేస్మెంట్

మహిళా సంఘం భవనానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొడంగల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండలం హస్నాబాద్ గ్రామంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.ప్రశాంత్ శుక్రవారం మహిళా సంఘం నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లేశం, భీములు తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను జయప్రదం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ రజోత్సవ సభను జయప్రదం చేయాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కొడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్, బొంరాస్‌పేట్, కొడంగల్, దుద్యాల మండల నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రజోత్సవ సభ పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. 27న జరిగే సభకు కొడంగల్ నియోజకవర్గం నుంచి కార్యకర్తలు, నాయకులు భారీగా తరలి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

శామీర్‌పేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తూంకుంటలోని బస్టాప్ సమీపంలో రేపు(ఆదివారం) ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మహిళలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు గైనకాలజీ స్పెషలిస్టు డాక్టర్ నర్మద తెలిపారు. మహిళలకు స్పెషలిస్టు డాక్టర్ల చేత గర్భకోశ వ్యాధుల పట్ల పరీక్షలను చేసి మందులను ఇవ్వనున్నట్లు వివరించారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



తాండూరు: నజరత్ ప్రేయర్ చర్చిలో ప్రార్థనలు



ఘట్‌కేసర్: కొండాపూర్‌లోని చర్చిలో ప్రార్థనలు

తాండూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తాండూరు నియోజకవర్గంలో గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. తాండూరు పట్టణం మార్వాడి బజార్‌లోని మేథడిస్ట్ చర్చి, రాజీవ్ గృహకల్పలోని నజరేత్ చర్చిలతో పాటు పలు చర్చిల్లో శుక్రవారం ఈ వేడుకలను సంప్రదాయ బద్ధంగా జరుపుకున్నారు. పాస్టర్ రెవ జనార్ధన్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు.

ఘట్‌కేసర్: గుడ్ ఫ్రైడే సందర్భంగా ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల పరిధిలో శుక్రవారం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం నుండే చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. ఈసందర్భంగా చర్చిల్లో ఏసుక్రీస్తు శిలువ అనంతరం తిరిగి వచ్చిన విషయాలపై నాటక ప్రదర్శనలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.





వికారాబాద్‌లోని చర్చిలో క్రైస్తవుల ప్రార్థనలు

వికారాబాద్: జిల్లా కేంద్రంలో గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని మెథడిస్ట్ చర్చితో పాటు ఆయా కాలనీలో ఉన్న చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ వేడుకల్లో క్రిస్టియన్ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం అస్తవ్యస్తం



పర్వత్‌పల్లిలో పాడుబడిన ఇల్లు, ఇన్‌సెట్‌లో రోడ్డుపై పాము

బషీరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్వత్ పల్లి లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. పలు చోట్ల పాడుబడిన ఇళ్లలోంచి పాములు బయటకు వస్తుండటంతో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నామని వారంటున్నారు. గ్రామంలో ఎక్కడ చూసినా చెత్తాచెదారంతో నిండి ఇళ్లపరిసరాలు, అంతర్గత రోడ్లు మురికి కూపంగా తయారైనట్లు స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండాపోయిందని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

వడదెబ్బ మృతులకు పరిహారం పెంపు

బషీరాబాద్: వడదెబ్బతో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.4లక్షల పరిహారం ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం వడదెబ్బను రాష్ట్ర విపత్తు కింద గుర్తించి పరిహారాన్ని పెంచుతున్నట్లు ఉత్తర్వులు జారీ చేసినట్లు రెవెన్యూ అధికారి ఒకరూ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.మృతులకు రూ.4లక్షల పరిహారం అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు వివరించారు. గతంలో అపద్భాంధువు పథకం కింద వడదెబ్బ మృతులకు రూ.50వేలు ఇచ్చేవారు.

ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ

కులకచర్ల: ప్రజలకు వైద్యసేవలు మరింత చేరువవుతున్నాయని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శేరి రాంరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రహ్లాద్ రావు అన్నారు. కులకచర్లలో శుక్రవారం పాలమూర్ శ్రీ ఆస్పత్రి వారు కొత్తగా ఆసుపత్రి ప్రారంభించారు. ప్రతీ బుధవారం వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్ రెడ్డి, మాజీ సర్పంచ్ జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలు దారుణం



తూంకుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

శామీర్‌పేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌ను అవమానించేలా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యానించడం దారుణమని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్, జైసంవిధాన్ కార్యక్రమ కోఆర్డినేటర్ ఎంఏ వహీం విచారం వ్యక్తం చేశారు. అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం రాత్రి తూంకుంటలో జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున జైబాపు, జైభీమ్, జై సంవిదాన్ అభియాన్ ర్యాలీని నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి భారీఎత్తున పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, నర్సింలు యాదవ్, వేణుగోపాల్‌రెడ్డి, బిక్షపతి, వెంకటేశ్ పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి



రైతులతో మాట్లాడుతున్న ఎస్ఐ సత్యనారాయణ, పోలీసులు

కొడంగల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మెడికల్, వెటర్నరీ కళాశాల నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పూర్తి స్థాయిలో పరిహారం అందించాలని రైతులు కోరారు. మండలంలోని అప్పాయిపల్లి శివారులోని సర్వే నెం.19లో శుక్రవారం అభివృద్ధి పనులకు భూమి చదును చేస్తుండగా గ్రామానికి చెందిన ఎరన్‌పల్లి శ్రీనివాస్, శేఖర్‌గౌడ్, నర్సప్ప, నర్సమ్మ తదితరులు పూర్తి స్థాయిలో పరిహారం అందించి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై సత్యనారాయణరెడ్డి అక్కడికి చేరుకొని అధికారులతో మాట్లాడి న్యాయం చేసేందుకు కృషి చేస్తామని రైతులకు నచ్చజెప్పారు. ఈ కార్యక్రమంలో బుగ్గయ్య, బుగ్గమ్మ, పకీరప్ప, అమృతప్ప, కిష్టయ్యగౌడ్, సావిత్రమ్మ, నారాయణసింగ్, బాలప్ప, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.